# శిథిలాలయాత్ర

"డాడీ... నేను సాగర్ వెళ్లొస్తాను" అంది పద్మావతి.

"సాగరా? ఎందుకు? ఇప్పుడు అక్కడెవరున్నారు?" అన్నాడు జగన్నాధరావు.

"ఒకసారి చూడాలని వుంది డాడీ. టెన్త్ వరకూ అక్కడే చదువుకున్నాను గదా? అక్కడికి వెళ్తే తెలిసినవాళ్లు ఎవరో ఒకరు కనిపిస్తారు".



"నీ ఇష్టం... ఇప్పుడక్కడ నీ ఫ్రెండ్స్ ఎవరూ వుండే ఛాన్స్ లేదు. అంతా ఎక్కడెక్కడికో వెళ్లి పోయుంటారు".

"మనం వుండొచ్చిన క్వార్టర్ వుంటుంది గదా! మనం పెంచిన మామిడి చెట్టు రెండు రకాల కాయలు కాసేది. నిమ్మచెట్టు సంవత్సరం పొడుగునా కాయలు కాస్తుండేది. నారింజ గుత్తులు గుత్తులు కాసేవి. ఎంత తియ్యగా వుండేవో! చలికాలంలో రేగి పళ్లు తెగ రాలేవి. పొద్దున్నే లేచి ఏరుకునేవాళ్లం. సన్నజాజి, మల్లెమొగ్గలు, చామంతి పూలు, ఎన్నో రకాల గులాబీలు పూచేవి. అవన్నీ కళ్ళ ముందు కనిపిస్తున్నాయి డాడీ".

"ఔనమ్మా! మనిషి చిన్ననాటి సంగతులు మర్చిపోలేడు. నాక్కూడా చిన్నప్పటివి ఇప్పటికీ గుర్తున్నాయి. సర్లే! రేపు మార్నింగ్ కారు తీసుకెళ్లు. మళ్లీ ఈవినింగ్ బయల్దేరి వచ్చెయ్" అన్నాడు జగన్నాధరావు.

పద్మావతి అమెరికా నుంచి వచ్చి పదిరోజులైంది. ఇంకొక పది రోజుల్లో ఆమె భర్త సాయిబాబా వచ్చేస్తాడు. తర్వాత మరొక పది రోజుల్లో మళ్లీ అమెరికా ప్రయాణం. ఈలోపల తను పుట్టి పెరిగి, టెన్త్ వరకూ చదువుకున్న నాగార్జునసాగర్ చూడాలని కోరిక కలిగింది ఆమెకు. కొన్నేళ్ల క్రితం వరకూ జగన్నాధరావు సాగర్లో ఇంజనీర్గా పనిచేసేవాడు. తర్వాత హైదరాబాద్ ట్రాన్స్ఫరయ్యాడు.

మర్నాడు ఉదయం ఐదేళ్ల కొడుకు సన్నీని తీసుకుని కారులో సాగర్ బయల్దేరింది పద్మావతి. సిటీ లిమిట్స్ దాటడానికే గంటన్నర పట్టింది. విపరీతమెన వాహనాలతో రోడ్లన్నీ క్రిక్కిరిసి పోయాయి. ప్రొద్దున్న ఎనిమిదింటికే ట్రాఫిక్ జామ్ కావడం ఏమిటోనని ఆమె ఆశ్చర్యపోయింది. కారు కొన్నిచోట్ల ఒక్కొక్క అడుగూ కదుల్తూ వెళ్తూ విసుగు పుట్టించింది.

"మమ్మీ మనం ఎక్కడికెళ్తున్నాం?" అని అడిగాడు సన్నీ కాసేపైన తర్వాత.

"మావూరు వెళ్తున్నాం" అన్నది నవ్వుతూ.

"మీవూరు హైదరాబాద్ కదా! తాత ఇక్కడే వున్నాడుగా?" అమాయకంగా

ప్రశ్నించాడు సన్నీ.

"మావూరంటే నేను పుట్టిన వూరు. నేను నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ హాస్పటల్లో పుట్టాను. టెన్త్ వరకు అక్కడ కాన్వెంట్ స్కూల్లో చదువుకున్నాను. మాకు చాలా పెద్దహౌస్ వుండేది అక్కడ. అందులో మామిడి, నిమ్మ, బత్తాయి, నారింజ, రేగు చెట్లున్నాయి. ఇంకా పందిరి మల్లె, సన్నజాజి, చామంతి, గులాబీ పూల మొక్కలున్నాయి. అన్ని చెట్ల మధ్య మా ఇల్లు చాలా బాగుంటుంది సన్నీ" పద్మావతి తన్మయత్వంతో చెప్తోంది...

"నాకు ఆ హౌస్ చూపిస్తావా?" అడిగాడు సన్నీ.

"ఓ... ఇంకా అక్కడ పెద్ద డ్యామ్ వుంది. ఇక్కడ హుస్సేన్‌సాగర్ కంటే పెద్ద రిజర్వాయర్ వుంది. అక్కడ కరెంట్ తయారవుతుంది తెలుసా? నీకు అదంతా చూపిస్తాను" అంది పద్మావతి.

సన్నీ చిప్స్‌తిని, పాలు తాగి సీటుకి జారగిలి పడుకుని కళ్లు మూసుకున్నాడు.

కాసేపటికి నిద్రలోకి జారి



పోయాడు. పద్మావతి వాడిని వొళ్లోపడుకోబెట్టుకుంది. ఆమె ఆలోచనలు గతంలోకి జారిపోయాయి.

ఆ రోజుల్లో తమ పక్క క్వార్టర్లో ఉండే ధర్మరాజారావు కుటుంబం గుర్తుకొచ్చింది. ఆయన తెలుగు మాష్టారుగా పనిచేసేవాడు. చాలా ఉత్సాహవంతుడు. అభ్యుదయ సమితి పేరుతో అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. ప్రముఖులతో ఉపన్యాసాలు ఇప్పించడం, నాటికలు వేయించడం, పిల్లలకు తెలుగు పద్యాలు చదవడంలో పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం వంటి అనేక ఫంక్షన్స్ జరిగేవి.

'కులాలు, మతాలు మనుషులను చీలుస్తున్నాయని, మనమంతా భారతీయులం అనే భావంతో ఒకరినొకరు ప్రేమిస్తూ, కులమతాలకు అతీతంగా సుఖజీవనం చేయాలనీ" చెప్తుండేవాడు.

ఆగస్ట్ 15, రిపబ్లిక్‌డే, గాంధీజయంతి వంటి రోజులు పిల్లలకు పండుగ వాతావరణం తెచ్చేవి. నాగార్జునసాగర్‌లోని కాలనీలన్నీ గ్రామాల వలె వుండేవి. అందరికీ అందరూ పరిచయస్తులే వుండేవారు. పట్టణ వాతావరణం కనిపించేది కాదు. ఎంత మధురమైన బాల్యం?... అవి నిజంగా బంగారు రోజులు.

ధర్మరాజారావుగారి అమ్మాయి జానకి ఇప్పుడు ఎక్కడుందో? ఇద్దరూ చాలా క్లోజ్‌గా తిరిగేవారు. ఎత్తిపోతల వెళ్ళినా, నాగార్జున కొండకు లాంచీలో ప్రయాణం చేసినా కలిసే వుండేవారు. టెన్త్‌క్లాస్ తర్వాత తను హైదరాబాద్ రావడంతో తమ స్నేహం ఆగిపోయింది. జానకి ఇప్పుడు ఎక్కడుందో? మాష్టార్ని అడ్రస్ అడిగి తెలుసుకోవాలి. వీలుంటే ఒకసారి కలిసి చిన్ననాటి సంగతులు నెమరువేసుకోవాలి.

పద్మావతి ఊహాలోకంలో విహరిస్తూ వుండగా నాగార్జునసాగర్ వచ్చేసింది.

"మేడమ్! ఎక్కడికి వెళ్ళాలి?" డ్రైవర్ ప్రశ్నించడంతో వాస్తవంలోకి వచ్చింది పద్మావతి.

కారు విజయ విహార్ దాటుతోంది. రోడ్‌కి ఇటుప్రక్క జోసెఫ్ కాన్వెంట్ స్కూలు కనిపిస్తోంది.

"ముందుకు పోనీ!" అంది ఆమె డ్రైవర్‌కి దారి చెప్తూ.

కారు ప్రోజెక్ట్ హౌస్ ఆవరణలో ఆగింది.

'లంచ్ చేసి వెళ్దాం. కారు పార్క్ చేసిరా!" అన్నది పద్మావతి కారు దిగి కేంటీన్‌లోకి వెళ్తూ.

లంచ్ చేసిన తర్వాత డ్యామ్‌సైట్, పవర్ స్టేషన్, ఎత్తిపోతల చూసి కొన్ని స్నాప్స్ తీసుకుంది. తిరుగు ప్రయాణంలో తాము ఉన్న క్వార్టర్ ముందున్న బోర్డు చూసి షాక్ తగిలింది. అదొక కుల సంఘ బోర్డు. ఫలానా కుల సంఘం కార్యాలయం అనే సైన్ బోర్డు చూసి చాలాసేపటివరకూ తేరుకోలేకపోయింది.


ఒకప్పుడు కులమతాలకు అతీతంగా, పరస్పరం గౌరవించుకుంటూ, ప్రేమానురాగాలతో పెరిగిన చోట కుల సంఘాలా? దానికి కార్యాలయాలా? మనిషి ఎంత కుంచించుకుపోయాడు?

"ఎవరూ?" అంటూ క్వార్టర్ అరుగు మీద నిల్చున్న వ్యక్తి పద్మావతిని చూసి ప్రశ్నించాడు.

ఆయన ధర్మరాజారావు. కులసంఘం ఆఫీసులో ఆయన్ని చూసి బిత్తరపోయింది పద్మావతి.

"మాష్టారూ! నేను పద్మావతిని. జగన్నాధరావుగారి అమ్మాయిని. ఈ క్వార్టర్‌లో వుండేవాళ్ళం" అన్నది తేరుకుని.

"నువ్వా! పద్మా! రా...రా...! చాలా పెద్దదానివైపోయావు. గుర్తుపట్టలేకపోయాను" అంటూ




గేటు తీసాడు.

పద్మావతి కొడుకుని నడిపించుకుని లోపలికి వెళ్ళింది. ఇల్లంతా పాడుబడిపోయింది. ఒక్క పూలమొక్క కూడా లేదు. మామిడి చెట్టు తప్ప వేరే చెట్లు లేనే లేవు. ఒకప్పుడు పచ్చగా కళకళలాడిన ఇల్లు కళావిహీనంగా కనిపించేసరికి ఆమె కడుపు తరుక్కుపోయింది. పాడుబడిన శిధిలాలయం గుర్తొచ్చింది.

"మాష్టారూ! చెట్లన్నీ ఏమైపోయాయి?" ఆవేదన నిండిన స్వరంతో అడిగింది పద్మావతి.

"పెంచిపోషించేవాళ్లెవరమ్మా! నారింజ, బత్తాయి, నిమ్మ చెట్లు ఎండిపోయాయి. రేగు చెట్లు కొట్టించేశాం. అది బాగా పెరిగిపోయి అంతా చీకటైపోయింది. చల్లదనానికి పాములు చేరుతున్నాయి" అంటూ లోపలకు దారితీసాడు.

"అయ్యో!" అని నిట్టూర్చింది.

"ఆ రోజుల్లో మీ నాన్న దగ్గర అటెండర్లు, మాలీలు వుండే వాళ్లు కాబట్టి ఇంత పెద్ద క్వార్టర్ మెయింటెయిన్ చేసారు. ఇప్పుడెవరివల్ల అవుతుంది? కాంపౌండ్ ఊడవాలంటేనే నడుం పడిపోతుంది. అందుకే మన కుల సంఘానికి అలాట్ చేయించాం" అన్నాడు ధర్మరాజారావు.

తర్వాత ఆమె గురించి వివరాలు అడిగాడు. అమ్మా, నాన్నా బాగున్నారా? అని పరామర్శించాడు.

"మాష్టారూ! జానకి ఇప్పుడు ఎక్కడుంది?" అడిగింది పద్మావతి.

ధర్మరాజారావు ముఖకవళికలు మారిపోయాయి. అప్పటి వరకూ నవ్వుతూ మాట్లాడిన ఆయన గంభీర ముద్ర వహించాడు.

"జానకి చచ్చిపోయింది" అన్నాడు తల వంచుకుని.

అయ్యో! ఎలా?..." అని అంది పద్మావతి విచారంతో.

ఆయన తలవంచుకుని వుండిపోయాడు. ఏమీ మాట్లాడలేదు. ఇక జానకి గురించి రెట్టిం

చలేదు. జానకి ఎందుకు చనిపోయిందో ఏమో? నోరుతెరిచి చెప్పలేకపోతున్నాడు. అదంతా గుర్తుకుతెచ్చి బాధపెట్టడం ఎందుకులే అనుకుంది. ఆయన భార్య పార్వతమ్మను అడిగితే అన్నీ వివరంగా చెప్తుంది అని సమాధానపడింది.

"మాష్టారూ! ఇంటికి వెళ్లొస్తాను. ఆంటీని పలకరించి వస్తాను" అని లేచింది పద్మావతి.

"ఆంటీ ఇంట్లో లేదమ్మా! సుధాకర్ దగ్గర వుంటోంది" అన్నాడు.

"అదేంటి మాష్టారూ! ఆంటీ కొడుకు దగ్గర వుంటే మీరిలా ఒంటరిగా ఎందుకున్నారు? మీరు కూడా సుధాకర్ దగ్గరకెళ్ళి వుండొచ్చుగా!" అన్నది పద్మావతి.

ధర్మరాజారావు నవ్వి వూరుకున్నాడు. పద్మావతి కొంచెంసేపు కూర్చుని "వస్తాను మాష్టారూ!" అని బయల్దేరింది.

"మమ్మీ! మీ హౌస్ చూపిస్తానన్నావుగా?" అడిగాడు సన్నీ.

"అది ఇప్పుడు లేదు సన్నీ, ఆ హౌస్ పడిపోయింది" అంది పద్మావతి.

* * *

పద్మావతి అమెరికా వెళ్లిపోయే రోజు దగ్గరపడింది. సాయిబాబు ప్రయాణ సన్నాహాలు మొదలుపెట్టాడు. అక్కడ ఫ్రెండ్స్‌కి ఇవ్వడానికి పుల్లారెడ్డి స్వీట్స్ తేవడానికి బయల్దేరాడు. సన్నీ తండ్రి వెంటపడ్డాడు. 'డాడీ నేను వస్తా!' అని.

"సన్నీని తీసుకెళ్ళి సమోసా ఇప్పించు సాయీ... అవంటే బాగా లైక్ చేస్తున్నాడు. ఇష్టంగా తింటున్నాడు" అంది పద్మావతి.

"నువ్వు కూడా రారాదూ! ఏ స్వీట్స్ బావుంటాయో... సెలెక్ట్ చేద్దువుగాని" అన్నాడు సాయిబాబు.

పద్మావతి, సన్నీని తీసుకుని బయల్దేరింది. కారు దిగగానే సన్నీ స్వీట్ షాపులోకి పరిగెత్తాడు.

లోపల సన్నీ వయసున్న బాబు పేపర్ ప్లేట్లో సమోసా తింటున్నాడు. బాబు తల్లి సన్నీని చూసి "రా బాబూ! ఇదుగో సమోసా!" అంటూ మరొక ప్లేట్‌లో పెట్టింది సమోసా.

"అబ్బే! వద్దండీ... షర్టంతా ఖరాబు చేసుకుంటాడు. ఇంటి కెళ్లాక తింటాడు. పార్సెల్ తీసుకెళ్తాం" అంటూ పద్మావతి ఆమె దగ్గరకు వచ్చింది.

ఆమె పద్మావతిని ఎగాదిగా చూసి "పద్మా! నువ్వా!" అన్నది ఆశ్చర్యపోతూ.

పద్మావతి త్రుళ్లిపడింది. ఆమెను వెంటనే గుర్తుపట్టలేకపోయింది. ఆమెను ఎక్కడో చూసినట్లుంది. బాగా లావు అవడం వలన గుర్తు రావడంలేదు. ముఖంలో జానకి పోలికలు కనిపిస్తున్నాయి. కాని జానకి కావడానికి ఛాన్స్ లేదు కదా! జానకి చనిపోయింది కదా! అని ఆలోచిస్తోంది.

"మీరు...మీరు..." అని తడబడింది పద్మావతి.

"మీరు... మీరు... ఏమిటే నీమొఖం. నన్ను గుర్తుపట్టలేదా! అంత మారిపోయానా? నేనే జానకిని" అన్నది.

పద్మావతి షాక్ తిన్నట్లయిపోయింది.

"జానకివా?..." అని నోరెళ్లబెట్టింది.

"ఔనే!... రా... కూర్చో! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు కనిపించావే? ఔనూ! వీడు మీ బాబా! సాగర్ నుంచి వెళ్లిపోయాక మళ్లీ తొంగి చూళ్లేదే మీరు" అంటూ జానకి గలగలా మాట్లాడేస్తోంది.

పద్మావతి ఆశ్చర్యం నుంచి తేరుకుని, సాయిబాబుని జానకికి పరిచయం చేసింది.

"ఐతే మీరు క్లాస్‌మేట్స్ అన్నమాట. అనుకో కుండా కలిసారు. వెరీ థ్రిల్లింగ్. నైస్ టూ మీట్ యూ!" అన్నాడు సాయిబాబు.

స్వీట్స్ తీసుకున్నాక జానకిని తనతో పాటు ఇంటికి తీసుకెళ్ళింది పద్మావతి. ఇద్దరూ చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు. జానకిని చూసి జగన్నాథరావు దంపతులు సంతోషించారు. ఆ పూట అక్కడే భోజనం చేశారు జానకి, ఆమె కొడుకు.

"మొన్నీమధ్య సాగర్ వెళ్లానే" అన్నది పద్మావతి.

'జానకి చనిపోయిందని' స్వయంగా ఆమె తండ్రి చెప్పడం పద్మావతి జీర్ణించుకోలేకపోతోంది. ఆయన ఎందుకలా చెప్పివుంటాడు? కూతురు చనిపోయిందనే నిర్ణయానికి ఎందుకొచ్చాడు? జానకి ఏదైనా తప్పు చేసిందా!'

పద్మావతికి తెలుసుకోవాలని వుంది. 'జానకిని అడిగితే?' అనుకుంది గానీ ఆమె ఏమైనా బాధపడుతుందేమో? అని సంశయిస్తోంది.

"సాగర్ వెళ్లావా? అయితే మీరున్న ఇంటికెళ్లావా?" అడిగింది జానకి.

"ఆ...వెళ్లాను"

"ఆ క్వార్టర్‌ని కుల సంఘానికి అలాట్ చేయించుకున్నారు. అక్కడ మానాన్నే సెక్రటరీ" అన్నది జానకి నవ్వుతూ.

"ఔనే! మనం స్కూల్లో చదువుకునేటప్పుడు మనుషుల్ని కులమతాలు విడదీస్తున్నాయని, అవన్నీ మరిచి అన్నదమ్ముల్లా, భారతీయులనే భావనతో జీవించాలనీ వుపన్యాసాలు దంచేవాడుగా మీనాన్న. మరి ఇప్పుడేంటి కుల సంఘం నడపడం...!" అన్నది పద్మావతి.

"ఏదైనా తన దాకా వస్తే గానీ తెలియదు. అనుభవమైతేగాని తత్వం బోధపడదన్నారు. ఇంతకీ అక్కడ మా ఇంటికి వెళ్లావా? మా నాన్నను కలిసావా?" అన్నది జానకి.

"ఆ... కలిసాను"

"జానకి చచ్చిపోయిందని చెప్పివుంటాడే. అందరికీ అలాగే చెప్తుంటాడు" నవ్వింది జానకి.

"ఔనే! అలాగే చెప్పారు. కానీ ఎందుకలా?" ఆశ్చర్యపోతూ అడిగింది పద్మావతి.

"ఏముంది? పెద్దరికం. నేను గోపాల్‌ని ప్రేమించాను. పెళ్లి చేసుకుంటానంటే అడ్డుపడ్డాడు. అతనిది మన కులం కాదని అభ్యంతరం. మేమెంత బ్రతిమాలినా వినలేదు. ఎవరు చెప్పినా ససేమిరా అన్నాడు. తను పట్టిన పట్టు విడవలేదు. మేమిద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం. తెగించి పెళ్లిచేసుకున్నాం. అంతే... ఇక ఇంటి గుమ్మం తొక్కొద్దన్నాడు. తెగతెంపులు చేసుకున్నాడు. నా గురించి అడిగిన వారికి చచ్చిపోయిందని చెప్తుంటాడు" అన్నది జానకి.

పద్మావతికి అంతా అర్థమైంది.

నువ్వు చెప్పవే! నా తప్పేమిటి? మనిషికి వ్యక్తిత్వం, స్వంత ఇష్టాలు వుండకూడదా? విలువలు ఎప్పటికీ మారకుండా వుంటాయా? కన్న కూతురి మీద ద్వేషం పెంచుకోవడం ఏమిటి? నేను పుట్టిపెరిగిన ప్రదేశానికి వెళ్లడానికి, చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకోవడానికీ వీల్లేకుండా పోయిందే!" జానకి వుద్విగ్నురాలై కన్నీరు కారుస్తోంది.

పద్మావతి ఆమెను ఓదార్చింది.

"మనిషి ద్వంద్వ ప్రమాణాలతో జీవిస్తుంటాడన్న మాట. ఇన్నాళ్లూ కులాలు, మతాలు లేవని అందరికీ నీతులు చెప్తూ వచ్చిన మనిషి తన దాకా వచ్చేసరికి ఆదర్శాలు గాలికి ఎగరేస్తాడన్నమాట. ఏం మనుష్యులో? అనుకుని నిట్టూర్చింది పద్మావతి. ●